సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం ၊ 9 ၊ ఆగస్టు ၊ 2023



శ్రీవారి సేవలో కలెక్టర్

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రాన్ని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మంగళవారం సందర్శించారు. ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.



మద్ది అంజన్నకు ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం రూరల్: మద్ది ఆంజనేయ స్వామిని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.



దొంగల ముఠా అరెస్టు

18 కేసుల్లో నిందితులుగా ఉన్న దొంగల ముఠాను ఏలూరు పోలీసులు అరెస్టు చేశారు. బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

డీఎన్నార్‌లో ఉచిత హెల్ప్ డెస్క్



భీమవరంలో డీఎన్నార్ కళాశాలలో ఉచిత హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ వాణి

సాక్షి, భీమవరం: భీమవరం డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏపీఈఏపీ సెట్-2023 ఉచిత హెల్ప్ డెస్క్‌ను మంగళవారం డాక్టర్ జీవీ వాణి చేతుల మీదుగా ప్రారంభిచారు. ఈ సందర్భంగా వాణి మాట్లాడుతూ ఇం/ టనీరింగ్‌లో చేరే విద్యార్థులు సరైన అవగాహన లేకుంటే కౌన్సిలింగ్‌లో సీటు కోల్పోయే ప్రమాదముందని ఇలాంటి తరుణంలో డీఎన్నార్ కళాశాల యాజమాన్యం విద్యార్థులకు సరైన అవహగాహన కల్పిస్తూ ఆప్షన్లు నమోదు చేసుకొనే సదుపాయం కల్పించిందన్నారు. భీమవరం పరిసర ప్రాంత విద్యార్థులు హెల్ప్ డెస్క్ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలన్నారు. కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణ రాజు(బాబు) మాట్లాడుతూ గత ఏడాది విద్యార్థులు ఇంటర్నెట్ కేంద్రాలు, మొబైల్ ఫోన్ ద్వారా ఐచ్ఛికాలను సరిగా ఎంపిక చేసుకోకపోవడం చాలా ఇబ్బందులకు గురయ్యారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అంజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెయిలింగ్‌ను ఢీకొట్టి.. కాలువలోకి దూసుకెళ్లి



కాలువ నుంచి వెలికితీసిన మోటారు సైకిల్

తణుకు: మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిల్‌తో సహా కాల్వలోకి దూసుకు వెళ్లగా ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా, మరో వ్యక్తి గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాడేపల్లిగూడెం మండలం పెద తాడేపల్లి గ్రామానికి చెందిన గొర్తి అచ్యుతం (45), దాసరి మార్కు ఒక మోటారు సైకిల్‌పై, అదే గ్రామానికి చెందిన ఎర్రోజు విజయ్, ఎర్రోజు మధు మరో మోటారుసైకిల్‌పై మంగళవారం తణుకు వచ్చారు. వీరిలో అచ్యుతం, మార్కులు తేతలి వైజంక్షన్ సమీపంలో మద్యం సేవిస్తుండగా విజయ్, మధు తణుకు డీమార్టుకు వెళ్లి సరుకులు కొనుక్కున్నారు. తిరిగి వీరు భోజనం చేసేందుకు తేతలి వైజంక్షన్ వద్దకు వచ్చారు. అప్పటికే అచ్యుతం, మార్కులు మద్యం మత్తులో బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. తేతలి సెంటర్ దాటాక కాలువ రెయిలింగ్‌ను ఢీకొట్టి బైక్‌తో సహా కాలువలో పడిపోయారు. ఈ ప్రమాదంలో అచ్యుతం నీటిప్రవాహానికి కొట్టుకుపోగా మార్కు ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నాడు. గాయాలపాలైన మార్కును చికిత్స నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాలువలో గల్లంతైన అచ్యుతం కోసం పోలీసులు, ఫైర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో మోటారుసైకిల్‌ను పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తణుకు రూరల్ ఎస్సై కె.గుర్రయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వార్డులకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో నిర్వహిస్తున్న పంచాయతీ ఎన్నికలకు సర్పంచ్, వార్డు మెంబర్ల నామినేషన్ వివరాలను జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు మంగళవారం తెలిపారు. జిల్లాలో మూడు సర్పంచ్ పదవులకు, 28 వార్డు మెంబర్ పదవులకు నోటిఫికేషన్ విడుదల చేశారు. నామినేషన్ల తొలి రోజు మంగళవారం సర్పంచి పదవికి ఎవరూ నామినేషన్ వేయలేదని తెలిపారు. వార్డు మెంబర్ల పదవి కోసం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయని తెలిపారు. వీరవాసరం మండలం మెంటేపూడిలో ఒకటి, పెంటపాడు మండలం చింతలపల్లిలో ఒకటి, తాడేపల్లిగూడెం మండలం కృష్ణయ్యపాలెంలో రెండు నామినేషన్‌లు దాఖలైనట్లు తెలిపారు.

ఫాం-ఎఫ్‌ను సమర్పించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కానింగ్ కేంద్రాలు స్కానింగ్ చేసిన ప్రతి గర్భవతి వివరాలను ప్రతి రోజు ఫాం-ఎఫ్‌లో సంబంధిత వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డి.మహేశ్వర రావు తెలిపారు. ఫాం-ఎఫ్‌లు అప్‌లోడ్ చేయని వారికి ఇప్పటికే నోటీసులు జారీ చేశామన్నారు. అయినా కొన్ని స్కానింగ్ కేంద్రాలు అప్‌లోడ్ చేయడం లేదని.. అలాంటి వారిపై నివేదిక తయారు చేసి పైఅధికారులకు పంపుతామన్నారు. అప్‌లోడ్ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే స్కాన్ సెంటర్లకు నోటీసులు ఇవ్వకుండా సీజ్ చేస్తామని, 5 రెట్ల వరకు జరిమానా విధిస్తామన్నారు.

దివ్యాంగులకు అండగా సీఎం

- సమస్యలు విని చలించిన ముఖ్యమంత్రి
- అక్కడికక్కడే రూ.6 లక్షల చెక్కులు అందజేత

వేలేరుపాడు: దివ్యాంగుల సమస్యలు విని చలించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి ఉదారంగా ఆర్థిక సాయం అందించారు. సోమవారం ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం గొమ్ముగూడెం గ్రామంలో వరద బాధితులను పరామర్శించేందుకు వచ్చిన ముఖ్యమంత్రికి అనేక మండలాల నుంచి వచ్చిన దివ్యాంగుల తల్లిదండ్రులు తమను ఆదుకోవాలని వేడుకున్నారు. వారి సమస్యలు విని ముఖ్యమంత్రి చలించిపోయారు. వెంటనే ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను ఒక్కో దివ్యాంగుడికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. వేలేరుపాడు మండలం భూదేవిపేట గ్రామానికి చెందిన ముప్పినేని మదన్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. మదన్‌కు పుట్టిన ఇద్దరు మగ పిల్లలు చంద్రశేఖర్ షౌకత్, చైతన్య భరత్ పుట్టుకతో దివ్యాంగులు. భార్య మౌనిక కడు పేదరికంలో జీవిస్తోంది. సోమవారం ముఖ్యమంత్రికి తమ కుటుంబ దీన పరిస్థితి వివరించడంతో ముఖ్యమంత్రి స్పందించి, రూ.లక్ష చెక్కును కలెక్టర్ ద్వారా అందజేశారు. ప్రతి నెలా ఇద్దరు పిల్లలకు, మదన్ భార్యకు పెన్షన్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ నిరుపేద కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

దుర్గ మౌనికకు అండగా..

వేదగిరి మండలం ముండూరు గ్రామానికి చెందిన దొంత నాగరాజు కుమార్తె 21 ఏళ్ళ దొంత దుర్గమౌనిక రెండు కిడ్నీలు పాడైపోయాయి. పదేళ్లుగా మందులు వాడుతున్నా మౌనిక కిడ్నీలు మరింతగా చెడిపోవడంతో రెండు నెలలుగా డయాలసిస్ చేయిస్తున్నారు. దుర్గమౌనిక తల్లి సోమవారం ముఖ్యమంత్రికి తమ దైన్య స్థితిని వివరించడంతో వెంటనే స్పందించారు. వెంటనే వైద్య ఖర్చుల నిమిత్తం రూ.లక్ష చెక్కు కలెక్టర్ ద్వారా అందించారు.





ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్‌రెడ్డి కుక్కునూరు మండలం గొమ్ముగూడెం పర్యటనలో తమ గోడు వెళ్లబోసుకుంటున్న దివ్యాంగుల తల్లిదండ్రులు (ఫైల్)

చిన్నారుల అనారోగ్యానికి చలించి..

కుక్కునూరు మండలం గొమ్ముగూడెం గ్రామానికి చెందిన పిల్లి మహేష్ ఐదేళ్ల కుమారుడు పిల్లి గౌతమ్ కుమార్ శారీరక వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్ రెయిన్‌బో పిల్లల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కడు పేదరికంలో మగ్గుతున్న మహేష్ వైద్యం కోసం ఇంట్లో సామాన్లు సైతం అమ్ముకున్నాడు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్యం చేయించుకునే స్థితిలో ఈ కుటుంబం లేదు. ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళగా, తక్షణ సాయంగా లక్ష రూపాయల చెక్కును కలెక్టర్ ద్వారా అందించారు. ఇదే గ్రామానికి చెందిన బానాల సాయిగణేష్ కుమార్తె భవ్యశ్రీ గుండె సంబంధ వ్యాధితో బాధపడుతుందని, తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరగా స్పందించిన ముఖ్యమంత్రి రూ.లక్ష ఆర్థిక సాయం కలెక్టర్ ద్వారా అందించారు.

కిడ్నీ బాధితుడికి సాయం

జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి గ్రామానికి చెందిన ఎం వీరరాఘవులు కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. ప్రతి నెలా వైద్యం, మందులకు అయ్యే ఖర్చు భరించలేక నానా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేయడంతో వీరరాఘవులు బాధను మానవతా దృక్పథంతో అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి వైద్యం కోసం లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేయాలని కలెక్టర్‌ను ఆదేశించడంతో చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి, కేఆర్‌పురం ఐటీడీఏ పీఓ సూర్యతేజ, సబ్‌కలెక్టర్ అదర్వరాజేందర్, ఆర్డీఓలు తదితరులు పాల్గొన్నారు.





దివ్యాంగులకు రూ.లక్ష చెక్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఐటీడీఏ పీఓ సూర్యతేజ(ఫైల్)

వ్యాపారం పేరుతో రూ.55.47 లక్షలకు టోకరా

అవనిగడ్డ: వ్యాపారం చేస్తున్నట్టు నమ్మించి, పలువురికి మాయ మాటలు చెప్పి రూ.55.47 లక్షల మేర టోకరా వేసిన పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన నెక్కంటి శ్రవణ్‌కుమార్‌ని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ మురళీధరరావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం రాత్రి జరిగిన ప్రెస్‌మీట్‌లో కేసు వివరాలను విలేకరులకు డీఎస్పీ వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. పశ్చిమ గోదావరి తణుకు పట్టణానికి చెందిన నెక్కంటి శ్రవణ్‌కుమార్ వ్యాపారం పేరుతో ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో కొంతకాలం ఉన్నాడు. ఎక్కడికెళ్లినా ఆఫీస్‌ను ఏర్పాటు చేసి వ్యాపార కార్యకలాపాలు చేస్తున్నట్టు నమ్మించేవాడు. ఈ క్రమంలో కృష్ణా జిల్లా కోడూరులో ఉన్న శ్రవణ్‌కుమార్ అవనిగడ్డ మండలం రామకోటిపురం గ్రామానికి చెందిన తోట శ్రీహరి అనే వ్యక్తికి మాయమాటలు చెప్పి అతడి అప్పులు, మోటార్ బైక్ వ్యవహారం సెటిల్ చేస్తానని చెప్పి నమ్మబలికి రూ.9 లక్షల మేర వసూలు చేసి వెళ్లిపోయాడు.

అతనితో పాటు శ్రీహరికి చెందిన కారును తీసుకెళ్లాడు. శ్రీహరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా విస్తుగొలిపే విషయాలు వెలుగులోకి వచ్చాయి. శ్రవణ్‌కుమార్ గతంలో పెడన మండలానికి చెందిన రైతులను మోసం చేసి రూ.14.50 లక్షల ధాన్యం కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా పరారయ్యాడు. విస్సన్నపేటకు చెందిన రైతులను మోసం చేసి రూ.5 లక్షలు, కోడూరు మండలానికి చెందిన రైతుల నుంచి రూ.4.50 లక్షల ధాన్యం కొనుగోలు చేసి పరారయ్యాడు. గుంటూరు జిల్లా చేబ్రోలుకు చెందిన రైతుల నుంచి రూ.4.34 లక్షలు, అవనిగడ్డ మండలం వేకనూరుకు చెందిన ఓ రైతు నుంచి రూ.1.72 లక్షల విలువగల మినుములు కొని డబ్బులు ఇవ్వకుండా వెళ్లిపోయాడు. అతనిపై పలు పోలీస్ స్టేషన్లలో మొత్తం ఏడు కేసులు నమోదయ్యాయి. మంగళవారం అవనిగడ్డ మండల పరిధిలోని పులిగడ్డలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా శ్రవణ్‌కుమార్ పట్టుబడగా స్థానికుల సమక్షంలో విచారించి అరెస్ట్ చేశారు.

పిల్లలందరికీ టీకాలు వేయించాలి

కలెక్టరు ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమం ద్వారా పిల్లలకు ప్రతి టీకా తప్పక వేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ హౌసింగ్, నాడు-నేడు, ప్రాధాన్యత భవనాలు, నా మట్టి.. నా దేశం తదితర అంశాలపై మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం వ్యాధినిరోధక టీకాలు వేయాలని, ఏవైనా కారణాల వల్ల టీకా వేయకపోతే వారిని గుర్తించి ఈ నెల 7 నుంచి ప్రారంభమై 12 వరకు నిర్వహించే మిషన్ ఇంద్రధనుష్ 5.0 ప్రోగ్రాంలో టీకాలు వేయించాలన్నారు. మొదటి విడత ఆగస్టు 7 నుంచి 11 వరకు, రెండో విడత సెప్టెంబర్ 11 నుంచి 16 వరకు, మూడవ విడత అక్టోబర్ 9 నుంచి 14 వరకు ఉచితంగా టీకాలు వేస్తారన్నారు.

భవనాలు త్వరితగతిన పూర్తి చేయాలి

సచివాలయ పరిధిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న గ్రామ సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీ భవనాలు సెప్టెంబర్ 30 నాటికి పూర్తి చేయాలని తెలిపారు. బిల్లులకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్ లేకుండా అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రస్తుతం వివిధ దశలలో నిర్మాణ పనులు జరుగుతున్నాయని, వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణ పనుల్లో పురోగతి సాధించాలన్నారు. సంబంధిత అధికారులు లక్ష్య సాధన కోసం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి వారం ప్రగతి నివేదికలు అందజేయాలన్నారు. జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ప్రారంభం కాని ఇళ్లను సత్వరమే ప్రారంభించి పునాది స్థాయికి తీసుకురావాలని చెప్పారు. ముఖ్యంగా విద్యుత్, నీటి సరఫరాకు అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. పేదల ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందనే విషయాన్ని ప్రతి ఒక్కరు దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని పేర్కొన్నారు. నా మట్టి-నాదేశం కార్యక్రమానికి సంబంధించి 9న మండలంలోని అన్ని పంచాయతీల్లో ర్యాలీగా శిలాఫలకం దగ్గరకు వెళ్లి సెల్ఫీ దిగిన ఫొటోలు అప్‌లోడ్ చేయాలని, 10న అన్ని గ్రామాలలో ప్రతిజ్ఞ చేయాలని, 11న ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో 75 మొక్కలు నాటలని.. కొద్దిగా మట్టి తీసుకొచ్చి మండల స్థాయిలో శిలా ఫలకం వద్ద ఉంచాలన్నారు. 14న వీరులకు వందనంలో సన్మానం చేయాలని, 15న జెండా వందనం చేయాలని చెప్పారు. 16న మండల స్థాయి సమావేశం జరుగుతుందని తెలిపారు. పంచాయతీ ఎన్నికలలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని తూచ తప్పక పాటించాలన్నారు. నామినేషన్లు స్వీకరించే ప్రదేశం నుంచి 100 మీటర్ల పరిధి వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఎన్నికలు జరిగే పంచాయతీలలో బహిరంగ సభలు, ర్యాలీలు, ప్రార్థనా స్థలాల్లో సమావేశాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు వంటివి నిషేధం అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు, డీఈవో ఆర్.వెంకటరమణ, హౌసింగ్ ఇన్‌చార్జ్ పీడీ ఎస్‌టీవీ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రేషన్ బియ్యంతో వంటకాల పోటీ

భీమవరం(ప్రకాశం చౌక్): రేషన్ బియ్యంతో అద్భుతమైన వంటలు తయారు చేసుకోవచ్చని, ఆ విషయాన్ని డీఆర్‌డీఏ, మెప్మా, ఐసీడీఎస్ విభాగాలకు చెందిన మహిళలు నిరూపించారని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం భీమవరం కలెక్టరేట్ గ్రౌండ్‌లో పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ ఏర్పాటుచేసిన రేషన్ బియ్యంతో 108 వంటకాలు తయారీ పోటీలను కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి ప్రారంభించారు. ఒకే వేదికపై రేషన్ బియ్యంతో 108 రకాల వంటకాలు తయారుచేశారు. వంటలను కలెక్టర్ రుచి చూసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రేషన్ బియ్యంతో వంటలు తయారు చేసిన మహిళలను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ బియ్యంతో అనేక వంటలు చేసుకోవచ్చని, రుచి అనేది ఖరీదైన వస్తువులతో రాదని, మనసుపెట్టి, ప్రేమగా వండితే రేషన్ బియ్యానికి ఏవీ సాటిరావన్నారు. రేషన్ బియ్యాన్ని తక్కువగా భావించడం సరికాదని, ప్రస్తుతం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యంలో పోషక విలువలతో కూడిన ఫోర్టిఫైడ్ కెర్నల్స్ కలపడం వల్ల మంచి పోషకాలు లభ్యమవుతాయన్నారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతులు అందజేశారు. ఎక్కువ వంటలు చేసిన వేంద్రకు చెందిన డ్వాక్రా మహిళ దండు కృష్ణవేణికి ప్రత్యేకంగా చీరను బహూకరించారు. డీఆర్ఓ కె.కృష్ణవేణి, ఆర్డీఓ దాసిరాజు, పౌర సరఫరాల అధికారి ఎస్.సరోజ, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ టి.శివరామ ప్రసాద్ పాల్గొన్నారు.





పోటీలో పదార్థాలు రుచిచూస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ప్రదర్శనలో తయారు చేసిన వంటకాలు

శ్రీవారి క్షేత్రానికి స్మోక్ ఫ్రీ జోన్ డిక్లరేషన్

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రానికి స్మోక్ ఫ్రీ జోన్‌గా గుర్తింపు లభించింది. దాంతో సంబంధిత డిక్లరేషన్‌ను ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావుకు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మంగళవారం అందజేశారు. దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను స్మోక్ ఫ్రీ జోన్‌లుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా శ్రీవారి కొండపైన ద్వారకా అతిథి గృహంలో స్మోక్ ఫ్రీ జోన్ డిక్లరేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్‌టీసీపీ అధికారి డాక్టర్ పి.ప్రశాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో తిరుమల తిరుపతి, విజయవాడ కనకదుర్గమ్మ ఆలయాలను స్మోక్ ఫ్రీ జోన్‌లుగా గుర్తించారన్నారు. ద్వారకాతిరుమల క్షేత్రాన్ని స్మోక్ ఫ్రీ జోన్‌గా చేసేందుకు, గత ఆరు నెలల నుంచి ఈ క్షేత్రంలో ధూమపానం, మద్యపాన నిషేధం అమలుకు సంబంధించిన అవగాహనా కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించామన్నారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ శ్రీవారి క్షేత్రాన్ని స్మోక్ ఫ్రీ జోన్‌గా ప్రకటిస్తూ డిక్లరేషన్ మీద సంతకం చేసి, సర్టిఫికెట్‌ను ఆలయ ఈఓకు అందజేశారు. రాష్ట్ర స్మోక్ ఫ్రీ జోన్ లీగల్ అడ్వయిజర్ పి.శివశంకర్ మాట్లాడుతూ భారత దేశంలో దేవాలయాల పరిసర ప్రాంతాల్లో పొగాకు అమ్మకాలు, ఉత్పత్తులను నిషేధించాలంటూ ప్రభుత్వం చట్టాన్ని రూపొందించిందని, దాని ప్రకారం ద్వారకాతిరుమల క్షేత్రాన్ని స్మోక్ ఫ్రీ జోన్‌గా గుర్తించారన్నారు. శ్రీవారి దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు మాట్లాడుతూ చిన్నతిరుపతి క్షేత్రానికి స్మోక్ ఫ్రీ జోన్ సర్టిఫికెట్ లభించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర స్మోక్ ఫ్రీ జోన్ అడ్వయిజర్ డాక్టర్ సౌజన్య లక్ష్మి, రాష్ట్ర ప్రోగాం అసిస్టెంట్ డాక్టర్ లక్ష్మీ సౌజన్య, జిల్లా ఇన్‌చార్జి డీఎం అండ్ హెచ్ఓ ఎం.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



డిక్లరేషన్‌ను ఈఓ త్రినాథరావుకు అందజేస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

పోలీసుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ

- జిల్లా ఎస్పీ కృషికి ప్రశంసలు
- 870 మంది పోలీసు కుటుంబాలకు ఉచిత వైద్య సేవలు
- సిబ్బంది పిల్లలకు ఉద్యోగాల కోసం ప్రత్యేక శిక్షణ

సాక్షి, భీమవరం: శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు సిబ్బంది సేవలు వెలకట్టలేనివి. అయితే ఎండనక, వాననక నిత్యం విధి నిర్వహణలో ఒత్తిడి మధ్య పని చేసే పోలీసు సిబ్బంది కుటుంబంతో గడిపే సమయం తక్కువ. కొన్నిరోజులు పాటు కుటుంబాలకు దూరంగా పనిచేయాల్సిన పరిస్థితులు ఉంటాయి. పోలీసు సిబ్బంది ఇబ్బందులను గుర్తించిన జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ తన శాఖలో పనిచేసే పోలీసు సిబ్బంది కుటుంబాల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. 40 ఏళ్ల పైబడిన 870 మంది సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల కోసం ప్రత్యేక మాస్టర్ హెల్త్ చెకప్ ఏర్పాటు చేశారు. వన్‌టౌన్‌లోని డీఎస్పీ కార్యాలయం దగ్గరలో ప్రత్యేకంగా ఆసుపత్రి ఏర్పాటు చేయించి అందులో ప్రతి నిత్యం పోలీసు సిబ్బంది, వారి కుటుంబసభ్యులకు ఉచితంగా 17 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చే ఏర్పాటుచేశారు. ఆసుపత్రిలో బ్లడ్ ఎనలైజర్ మెషీన్ సదుపాయం ఉపయోగకరంగా ఉంది. ఆసుపత్రి ఏర్పాటుతో చేతులు దులుపుకోకుండా ప్రతి సోమవారం ఆసుపత్రికి వచ్చే రోగులతో మాట్లాడి వైద్య సేవలు ఎలా అందుతున్నాయో తెలుసుకుంటున్నారు.

పిల్లలకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ

నేటి ప్రపంచంలో డిజిటల్ అక్షరాస్యత ప్రాముఖ్యత గుర్తించిన ఎస్పీ పోలీసు సిబ్బంది పిల్లలకు ఉచితంగా కంప్యూటర్ కోచింగ్ ఇప్పిస్తున్నారు. పట్టణంలోని ఒక ప్రైవేటు కంప్యూటర్ సెంటర్‌తో ఒప్పందం చేసుకుని పోలీసు సిబ్బంది విద్యార్థులకు పైథాన్, టాలీ, జావా వంటి కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే 17 మంది విద్యార్థులు కంప్యూటర్ శిక్షణ పూర్తిచేసుకుని సర్టిఫికెట్లు తీసుకున్నారు.



భీమవరం పోలీసు ఆసుపత్రిలో ఉచితంగా పరీక్షలు చేస్తున్న దృశ్యం



కంప్యూటర్ శిక్షణ పొందిన పోలీసు సిబ్బంది పిల్లలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎస్పీ రవిప్రకాష్

ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు శిక్షణ :

ఎస్సై, కానిస్టేబుల్ పరీక్షలకు సిద్ధమవుతున్న పోలీసు సిబ్బంది పిల్లలకు ఉచిత కోచింగ్ తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే పోలీసు శాఖలో పని చేస్తున్న సిబ్బంది పిల్లలు అదే శాఖ పట్ల మక్కువ కలిగి మంచి భవిష్యత్తు ఏర్పాటు చేసుకోవాలని ఆశించేవారికి ఎస్పీ అండగా నిలుస్తున్నారు. ఎస్పీ చొరవతో ఏర్పాటుచేసిన శిక్షణకు 10 మందికి పైగా హాజరవుతున్నారు. పోలీసు సిబ్బందిలో సివిల్ సర్వీసెస్ పట్ల మక్కువ కలిగిన నలుగురు విద్యార్థులకు ఉచితంగా సివిల్ సర్వీసెస్‌లో శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లుచేశారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ

పోలీసు కుటుంబాల్లోని విద్యార్థులను ప్రోత్సహించడానికి మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నారు. విద్యార్థులు వారు చదువుకుంటున్న క్లాసుల్లో 90 శాతం పైగా మార్కులు సాధిస్తే నగదు స్కాలర్‌షిప్‌లు ఇచ్చి అభినందిస్తున్నారు. ఈ ఏడాది 25 మంది విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందించారు.

సంక్షేమ శాఖ నిధులతో పలు కార్యక్రమాలు



ప్రజాసేవలో నిత్యం నిమగ్నమై ఉండే పోలీసు సిబ్బంది వారి ఆరోగ్యం, కుటుంబం పట్ల శ్రద్ధ తీసుకునే సమయం తక్కువ. అందువల్లనే పోలీసు సంక్షేమ శాఖ నిధులతో జిల్లాలో వివిధ సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తున్నాం. సిబ్బంది ఆరోగ్యంగా ఉంటే ఎంతటి కష్టతరమైన కేసునైనా ఛేదించడం సులభమవుతుంది. సిబ్బంది కుటుంబ సభ్యుల ఆరోగ్యం, పిల్లల చదువులపై కూడా పోలీసుశాఖ తరపున ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

– యు.రవిప్రకాష్, ఎస్పీ, భీమవరం

ఇండోర్ రోయింగ్ జాతీయ పోటీలకు ఇద్దరి ఎంపిక



విద్యార్థులతో హెచ్ఎం లోవకుమారి, పీడీ ఎల్.జయరాజు

జంగారెడ్డిగూడెం: జాతీయ స్థాయి ఇండోర్ రోయింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు జంగారెడ్డిగూడెం బాలుర పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం కె.లోవకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఎర్రకాలువ వాటర్ స్పోర్ట్స్ సెంటర్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులకు ఇండోర్ రోయింగ్ పోటీలకు సంబంధించి ఎంపికలు నిర్వహించగా పాఠశాల నుంచి పదో తరగతి విద్యార్థులు బొర్ర అఖిల్ విఘ్నేష్, తామటి జాన్ వెస్లీ ఎంపికయ్యారన్నారు. వీరు ఈ నెల 11, 12, 13 తేదీల్లో పూనేలో జరిగే నేషనల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, కోచ్‌లు పి.కృష్ణమూర్తి, ఎం.రాజేష్‌లను హెచ్ఎం లోవకుమారి, ఆర్చరీ కోచ్, పీడీ ఎల్.జయరాజు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

క్లుప్తంగా

గల్ఫ్ ఏజెంట్‌పై కేసు

ఉండి: ఉణుదుర్రుకు చెందిన గల్ఫ్ ఏజెంట్ గుమ్మళ్ల వెంకన్నపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఉండి గ్రామానికి చెందిన ఆలమూరు సంపత్ అనే వ్యక్తి భార్యను గల్ఫ్ ఏజెంట్ వెంకన్న గత కొద్దికాలం క్రితం మస్కట్ దేశానికి జీవనోపాధి నిమిత్తం పంపించాడు. అయితే అక్కడ ఆమెకు సరైన తిండి, జీతం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో సంపత్ ఏజెంట్ ఇంటికి వెళ్లి తన భార్యను తిరిగి రప్పించాలని కోరగా, అతని నుంచి సరైన సమాధానం రాలేదు. దీనిపై సంపత్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.గంగాధరరావు చెప్పారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

లింగపాలెం: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ధర్మాజీగూడెం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కృష్ణా జిల్లా ముసునూరు మండలం వలసపల్లి గ్రామానికి చెందిన అబ్బుదాసరి జోజి (35) మంగళవారం ఇంటి నుంచి ధర్మాజీగూడెం వెళుతుండగా, మార్గమధ్యలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి జోజి పైనుంచి వెళ్లడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. జోజికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతలపూడి ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.చెన్నారావు తెలిపారు.

ఇద్దరి అరెస్ట్

పెదవేగి: దిబ్బగూడెం లక్ష్మీపురంలో స్థల వివాదంలో వ్యక్తి మృతికి కారకులైన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశామని నూజివీడు డీఎస్పీ అశోక్‌కుమార్‌గౌడ్ చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన యర్రా లూర్ధమ్మ 20 ఏళ్ల క్రితం ఆమె బంధువులు తమకున్న భూమిని కొంతమందికి ఇళ్లస్థలాలుగా అమ్మేశారు. అప్పట్లోనే బొడ్డు వెంకటేశ్వరరావు, బంధువులు కొంత స్థలాన్ని కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నారు. లూర్ధమ్మ ఆ స్థలాలు తమ పేరునే ఉన్నాయని, వాటిని ఖాళీ చేయాలని నాలుగు రోజుల క్రితం ఏలూరు నుంచి ఒక ప్రైవేట్ సర్వేయర్‌తో లక్ష్మీపురం వచ్చి బొడ్డు వెంకటేశ్వరరావుతో దౌర్జన్యంగా వ్యవహరించి వివాదానికి దిగింది. ఈ వివాదంలో తీవ్ర ఉద్వేగానికి లోనైన వెంకటేశ్వరరావు గుండెపోటుతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి ప్రైవేటు సర్వేయర్ సప్పా సాయి కుమార్, లూర్ధమ్మను మంగళవారం అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ తెలిపారు.

వైవిధ్యం.. గిరిజన జీవనం

కొండగూటికి పండగొచ్చింది. కలుషితం కాని సంప్రదాయాలను గౌరవించుకోవడానికి, ఆధునికీకరణ జబ్బు పట్టని సంస్కృతిని సన్మానించుకోవడానికి, స్వచ్ఛమైన మనసులను స్మరించుకోవడానికి ఒకరోజు వచ్చింది. అదే అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం. బుధవారం ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మన్యంలోని గ్రామాల్లో వేడుకలు నిర్వహించేందుకు అడవి బిడ్డలు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. జిల్లాలోని కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద ప్రభుత్వం ఆధ్వర్యంలోనూ ఈ వేడుకల నిర్వహణకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు.

- సంప్రదాయ నృత్యాలకు చిరునామా మన్యసీమ
- ఆసక్తికరంగా కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు
- ఏజెన్సీ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- మారుమూల గ్రామాలకూ సంక్షేమ పథకాలు
- నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం



గిరిజన దోలు కోయ నృత్యం చేస్తున్న గిరిజనులు (ఫైల్)



గిరిజనుల సంప్రదాయ విల్లును ఎక్కు పెట్టిన సీఎం జగన్ (ఫైల్)



గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు (ఫైల్)



అడవి నుంచి అడ్డాకు తెచ్చుకుంటున్న మహిళ



బాట పండుగ సందర్భంగా నృత్యాలు చేస్తున్న మహిళలు

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో అపురూపమైన సంస్కృతి, తరాలు మారినా మారని కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు, ఆహారపు అలవాట్లు అన్నింటిలోనూ ఆదివాసీ గిరిపుత్రులది ప్రత్యేకమైన శైలి. ఆదివాసీల జీవన స్థితిగతులను మెరుగుపరిచి వారి అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో బుధవారం ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని అడవిబిడ్డలు ఆనందాల నడుమ వేడుకలను జరుపుకుంటున్నారు.

అన్ని చోట్లా ఒకేలా ఆదివాసీల సమస్యలు

ఆదివాసీల జీవితాల స్థితిగతులను ప్రపంచానికి తెలియజేసేందుకు ఐక్యరాజ్యసమితి 1994 ఆగస్టు 9న జెనీవాలో ప్రపంచ ఆదివాసీ వర్కింగ్ గ్రూప్ సమావేశాలు ఏర్పాటు చేసింది. ఈ గ్రూప్ ఆదివాసీలపై అధ్యయనం చేసి ప్రపంచదేశాల్లో ఆదివాసీల సమస్యలన్నీ ఒకేలా ఉన్నాయని గుర్తించింది. దీంతో ప్రతి సంవత్సరం ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించాలని యూఎన్‌వో నిర్ణయించింది. నాటి నుంచి ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని గిరిపుత్రులు వేడుకగా జరుపుకుంటూ వస్తున్నారు.

అపురూపంగా సంప్రదాయాలు

గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, కట్టుబాట్లు, అలవాట్లు, వ్యవహార శైలిని గూర్చి కొత్తగా చెప్పవలసిన పనిలేదు. కొత్త అనే పదం వాడకుండా పాత అలవాట్లను అపురూపంగా కాపాడుకుంటూ వస్తున్నారు. తెల్లవారితే కొండపోడు వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల సేకరణతోనే వారి జీవనం ప్రారంభమవుతుంది. అడవులలో లభించే ఉత్పత్తులను సేకరించి వాటిని అమ్ముకోవడంతో పాటు పోడు వ్యవసాయం ద్వారా పండించుకున్న పంటలను తింటూ జీవనం సాగిస్తుంటారు. అడవులలో గిరిజనులకు లభించే ఉత్పత్తులను వారాంతపు సంతలకు తీసుకువచ్చి వాటిని విక్రయించి వాటి ద్వారా వచ్చే సొమ్ములతో వారానికి కుటుంబ పోషణకు సరిపోయే నిత్యావసర సరుకులను కొనుగోలు చేసుకుని తీసుకువెళ్తుంటారు. జిల్లాలోని ఐదు మండలాల్లో ఏజెన్సీ ప్రాంతం విస్తరించి ఉంది. వీటిలో బుట్టాయగూడెం మండలం పూర్తి ఏజెన్సీ ప్రాంతం. అదేవిధంగా గిరిజనుల అభివృద్ధి కోసం బుట్టాయగూడెం మండలం కోటరామచంద్రపురం (కేఆర్‌పురం)లో సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఏర్పాటు చేశారు.

వనదేవతలే ఆరాధ్య దైవాలు

మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీ గిరిజనులకు వనాలే ఆరాధ్య దేవతలుగా పూజిస్తారు. ఎక్కడ పూజలు చేసినా నైవేద్యాలు తప్పనిసరిగా అమ్మవారికి సమర్పిస్తారు. వీరి సంప్రదాయాలు, కట్టుబాట్లు విభిన్నంగా ఉంటాయి. భూదేవి పండుగ, బాట పండుగ, మామిడికాయ పండుగ, కొత్త కందుల పండుగలను ఎక్కువగా చేస్తారు. పండుగల నిర్వహణలో వారికి వారే సాటి. చిన్నాపెద్దా తేడా లేకుండా గిరిజన సంప్రదాయ నృత్యాలు చేస్తూ ఆనందంగా గడుపుతారు.

కొండపోడే ఆధారం

గిరిజన ప్రాంతంలోని ఆదివాసీలకు కొండపోడు వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. దీంతో జీవనం సాగిస్తూ గిరిజన కుటుంబాల వారు ఆనందంగా జీవిస్తారు. కొండ ప్రాంతాల్లో దట్టమైన అటవీ సమీపాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుని నివసిస్తూ భయం అంటే తెలియనట్లుగా ఉంటారు. వీరు క్రూరమృగాలు, విషసర్పాల మధ్య సాహస జీవితం గడుపుతుంటారు.

గిరిజన సంక్షేమం కోసం ఐటీడీఏ కృషి

ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల అభివృద్ధి కోసం జిల్లాలోని బుట్టాయగూడెం మండలం కోటరామచంద్రాపురం (కేఆర్‌పురం)లో సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ద్వారా గిరిజనుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది. గిరిజనులకు మౌలిక సదుపాయాలు కల్పించడం, విద్య, వైద్యం, రవాణా సౌకర్యాలు సురక్షితమైన మంచినీటి సదుపాయాలు అందుబాటులోకి తీసుకువచ్చింది. అదేవిధంగా గిరిజనుల అభివృద్ధి కోసం ట్రైకార్ ద్వారా రుణాలు అందిస్తోంది. అలాగే గిరిజన ప్రాంతంలో ఆదివాసీలు అనారోగ్యాల బారిన పడకుండా అన్ని ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉంచడంతో పాటు గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తోంది. అదేవిధంగా గిరిజన విద్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. అలాగే గిరిజన సహకార సంస్థ ద్వారా అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేసి వారికి ఆర్థిక ఆసరాగా నిలుస్తోంది.

గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి

గిరిజనుల అభివృద్ధికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. గిరిజనులకు 50 శాతం పనుల్లోనూ, పదవుల్లోనూ రిజర్వేషన్ కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంచలనమైన నిర్ణయం తీసుకోవడంతో పాటు చట్టాన్ని కూడా తీసుకువచ్చారు. ఈ చట్టంపై 50 శాతం మహిళలకు పలు పదవుల్లో అవకాశాలు లభించాయి. అదేవిధంగా అటవీ హక్కుల చట్టంలో పట్టాలు పొందిన సన్న,చిన్నకారు రైతులకు, మైదాన ప్రాంత రైతులకు సమానంగా హక్కు, ప్రభుత్వ పథకాలు పొందేలా చర్యలు తీసుకున్నారు. దీంతో సుమారు రెండు వేల గిరిజన కుటుంబాలు లబ్ధి పొందనున్నాయి. అదేవిధంగా అటవీహక్కుల చట్టంలో పోడు భూములు సాగు చేసుకుంటున్న అర్హులైన గిరిజనులకు హక్కు పట్టాల జారీకి ఏర్పాట్లు చేశారు. గత ప్రభుత్వ పాలనలో మూతబడిన పలు గిరిజన పాఠశాలలను తిరిగి పునఃప్రారంభించి కొండరెడ్డి గిరిజన బిడ్డలకు చదువుకునేలా కృషి చేస్తున్నారు. అదేవిధంగా గిరిజన ప్రాంత ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించేలా సుమారు రూ.50 కోట్లతో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మారుమూల కొండప్రాంతంలో ఉన్న గ్రామాల గిరిజనులకు నేరుగా అందడంతో ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నేడు ఐటీడీఏ వద్ద వేడుకలు

ప్రభుత్వ ఆదేశాలతో బుట్టాయగూడెం మండలం కేఆర్‌పురం ఐటీడీఏ పెరెడ్ గ్రౌండ్‌లో బుధవారం ఆదివాసీ దినోత్సవం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 గంటలకు ఆదివాసీ జెండా ఆవిష్కరణ, ప్రార్థనాగీతం, జ్యోతి ప్రజ్వలన నిర్వహిస్తారు. 10.30 గంటలకు ముఖ్య అతిథుల ఆహ్వానం, 11 గంటలకు ముఖ్య అతిథుల సందేశం, 12:30 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, 1:30 గంటలకు సన్మాన కార్యక్రమం, మధ్యాహ్నం రెండు గంటలకు వందన సమర్పణతో కార్యక్రమాలు ముగిస్తాయి.

వేడుకలకు ఏర్పాట్లు పూర్తి



అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయలు ఉట్టిపడేలా వేడుకలు కళా ప్రదర్శనలు ఏర్పాటు చేశాం.

– ఎం.సూర్యతేజ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, కేఆర్ పురం

గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట



గిరిజన అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించారు. 50 శాతం పనుల్లో, పదవుల్లో రిజర్వేషన్ కల్పించే విధంగా చట్టం చేశారు. గిరిజనుల విద్యాభివృద్ధి కోసం మూతపడిన పాఠశాలలు తెరిపించారు. విద్య, వైద్యం ఉపాధి, గిరిజన ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది.

– తెల్లం బాలరాజు, పోలవరం ఎమ్మెల్యే

యానాం మద్యం స్వాధీనం.. వ్యక్తి అరెస్టు



అరెస్టు చేసిన నిందితుడితో ఎక్సైజ్ సిబ్బంది

పెనుమంట్ర: పొలమూరులో అక్రమంగా మద్యం కలిగి ఉన్న ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు తణుకు ఎక్సైజ్ ఎస్సై టి.వెంకటేశ్వరరావు మంగళవారం చెప్పారు. గ్రామానికి చెందిన చిట్టూరి రామకృష్ణ, బొట్టా రాంబాబు పుదుచ్చేరి (యానాం) రాష్ట్రం నుంచి మద్యం అక్రమంగా తీసుకువచ్చి ఈప్రాంతంలో విక్రయిస్తున్నారని అందిన సమాచారం మేరకు దాడి చేసి సుంకం చెల్లించని 57 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని రామకృష్ణను అరెస్టు చేశామన్నారు. మరో నిందితుడు రాంబాబు పరారీలో ఉన్నాడన్నారు. ఇన్‌స్పెక్టర్ ఆర్.సత్యవతి, హెచ్‌సీ వై.ఏసురాజు పాల్గొన్నారు.

గడపగడపకు సంక్షేమం



తణుకు అర్బన్: తణుకు 13వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



కాళ్ల: దొడ్డనపూడి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఏలూరులో దొంగల ముఠా అరెస్ట్



ఏలూరులో వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, చిత్రంలో డీఎస్పీ శ్రీనివాసులు



స్వాధీనం చేసుకున్న బంగారపు వస్తువులు

- 18 చోరీ కేసుల్లో పట్టుబడిన ఆరుగురు నిందితులు
- రూ.36 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం
- ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి వెల్లడి

ఏలూరు టౌన్: ఏలూరు శ్రీరామ్‌నగర్‌లో ఒక ఇంట్లో చోరీ కేసును దర్యాప్తు చేసిన పోలీసులకు తీగలాగితే డొంక కదలినట్లు అనేక చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్న దొంగల ముఠా పోలీసులకు చిక్కింది. సుమారుగా 18 కేసుల్లో వీరు నిందితులుగా ఉన్నట్లు గుర్తించారు. దొంగల ముఠా నుంచి భారీగా బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, విలువైన ఫాసిల్ వాచ్, మోటారు సైకిళ్ళను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి కేసు వివరాలు వెల్లడించారు.

తీగలాగితే డొంక కదలినట్టు :

ఏలూరు శ్రీరామ్‌నగర్ 9వ రోడ్డులోని ఒక ఇంట్లో జూన్ 24న భారీ చోరీ జరిగింది. ఇంటి తలుపులు పగులగొట్టి బీరువాలోని వెండి, బంగారు ఆభరణాలు అపహరించారు. చోరీలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాలతో ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో ఏలూరు త్రీటౌన్ సీఐ కోమాకుల శివాజీ, నిడమర్రు సీఐ సుభాష్, ఎస్ఐలు, సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ కేసును దర్యాప్తు చేస్తుండగా అనేక కేసుల్లో నిందితులుగా ఉన్న దొంగల ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరంతా 18 కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఈనెల 7న శ్రీరామ్‌నగర్‌లోని సారథి కల్యాణ మండపం వద్ద నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. నిందితుల నుంచి సుమారుగా 801.246 గ్రాముల బంగారు ఆభరణాలను, అరకిలో వెండి వస్తువులను, ఒక ఫాసిల్ వాచ్, నాలుగు మోటారు సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. చోరీ సొత్తు విలువ సుమారుగా రూ.36 లక్షల 65వేలు ఉంటుందని అంచనా వేశారు.

నిందితులు వీరే..

దొంగల ముఠాలో దెందులూరు మండలం మసీదుపాడు గ్రామానికి చెందిన గురివెందుల వెంకటరమణ, చెముళ్లమూడి మోహన్, గుడిపూడి సునీల్‌కుమార్, మెరుగుమూడి రవి అలియాస్ కిషోర్, ప్రతీక్ సంపత్‌రావు యాదవ్, మాదేపల్లి గ్రామానికి చెందిన నరమామిడి వెంకటేశ్వరరావు అనే ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిపై 2021 నుంచి 2023 వరకూ పెదవేగి మండలంలో 5 కేసులు, ధర్మాజీగూడెం మండలంలో 7, దెందులూరు మండలంలో 2, ఏలూరు టూటౌన్‌లో 1, ఏలూరు రూరల్ 1, తడికలపూడి స్టేషన్ పరిధిలో ఒక కేసు ఉన్నాయి. వీరిలో నలుగురు చోరీలు చేస్తుండగా, మరో ఇద్దరు చోరీ సొత్తును కొనుగోలు చేశారు. వీరందరిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించింది. కేసును ఛేదించిన పోలీసు బృందాన్ని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. విలేకరుల సమావేశంలో ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, ఏలూరు త్రీటౌన్ సీఐ కోమాకుల శివాజీ, నిడమర్రు సీఐ ఎం.సుబాష్, ఎస్ఐలు శంకర్, స్వామి, సిబ్బంది ఉన్నారు.

ఫ్యాన్సీ దుకాణంలో చోరీ

పాలకోడేరు: శృంగవృక్షంలో సోమవారం అర్ధరాత్రి ఒక ఫ్యాన్సీ దుకాణంలో చోరీ జరిగి ఎనిమిది కాసుల బంగారం, రూ.50వేల నగదు అపహరణకు గురయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని బస్టాండ్ సెంటర్‌లో కుర్మాల కాశీవిశ్వనాథంకు చెందిన విజయ దుర్గా ఫ్యాన్సీ షాపు నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి షాపునకు తాళం వేసి ఆయన ఇంటికి వెళ్లగా, అర్ధరాత్రి దాటిన తర్వాత దొంగలు వెనుక వైపు నుంచి షాపులోకి ప్రవేశించి బీరువా పగలగొట్టి అందులో ఉన్న 8 కాసుల బంగారపు వస్తువులు, రూ.50 వేలు నగదు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు భీమవరం రూరల్ సీఐ నాగప్రసాద్, ఎస్సై నాళం శ్రీనివాసరావు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. క్లూస్ టీమ్ వేలిముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ నేత మృతి



మునిబాబు (ఫైల్)

ముదినేపల్లి రూరల్: వణుదుర్రు వైఎస్సార్ సీపీ నాయకుడు నంగెడ్డ మునిబాబు (68) మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. వణుదుర్రు పంచాయతీ సర్పంచ్ పదవికి 19న ఉప ఎన్నిక జరగనుంది. దీనిపై పార్టీ తరపున అభ్యర్థిని నిలబెట్టేందుకు స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్)తో చర్చించేందుకు కొంతమంది పార్టీ నాయకులతో కలిసి వణుదుర్రు నుంచి కైకలూరు వెళుతున్నారు. మునిబాబుతో ద్విచక్రవాహనంపై మరో నాయకుడు ఏసుపాదం ఉన్నారు. వీరిద్దరూ ప్రొద్దువాక సమీపంలోకి వెళ్లగానే ఎదురుగా వేగంగా వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏసుబాబు, మునిబాబులకు తీవ్ర గాయాలు కాగా, వెంటనే వీరిని 108 అంబులెన్సులో మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మునిబాబు మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మునిబాబు మరణంతో గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. కుమారుడు శేషుబాబు ఫిర్యాదు మేరకు ముదినేపల్లి ఎస్సై బి.వెంకటకుమార్ కేసు నమోదు చేసి మృతదేహానికి మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేయించారు. మునిబాబు మరణంపై ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, మండలంలోని పార్టీ నేతలు పలువురు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

బియ్యం సేకరణ వేగవంతం చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): బియ్యం సేకరణను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో రైస్ మిల్లర్స్ సంఘ ప్రతినిధులతో సమావేశమై బియ్యం సేకరణపై చర్చించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ బియ్యం సేకరణలో జాప్యం జరుగుతుందని, వేగవంతం చేయాలని ఆదేశించారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణకు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ టి.శివరాం ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డీఎస్ఓ ఎన్.సరోజ, జిల్లా కోపరేటివ్ అధికారి రవికుమార్, డీటీసీ ఉమామహేశ్వరరావు, సహాయ సరఫరాల అధికారి రవిశంకర్ పాల్గొన్నారు.

భార్య చెప్పకుండా పుట్టింటికి వెళ్లిందని..

పెదవేగి: భార్య తనకు చెప్పకుండా పుట్టింటికి వెళ్లిందనే మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని బలన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అమ్మపాలెంకు చెందిన చింతకుంట తిరుపతయ్య (45), కృష్ణకుమారిలకు 26 ఏళ్ల క్రితం వివాహమైంది. కృష్ణకుమారి ఐదేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లి మూడు నెలల క్రితం తిరిగి వచ్చింది. అప్పటినుంచి భార్యభర్తల మధ్య గొడవలు రాగా గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు పరిష్కరిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో వారం క్రితం కృష్ణకుమారి భర్తకు చెప్పకుండా పుట్టిల్లు కంద్రికనరసన్నపాలెం వెళ్లింది. ఈ నేపథ్యంలో ఈనెల 6న అదే గ్రామంలో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లి రాత్రి భోజనం చేసి, తన ఇంటికి వెళ్ళిపోయాడు. మంగళవారం తిరుపతయ్య ఇంటికి వచ్చి తలుపులు కొట్టగా స్పందన లేదు. స్థానికుల సాయంతో తలుపులు పగులకొట్టి చూడగా ఇంట్లో ఫ్యాన్‌కు సిల్క్ చీరతో ఉరివేసుకుని వేలాడుతూ తన కుమారుడు కనిపించాడని తిరుపతయ్య తండ్రి అబ్రహం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీఎం జగన్ సంక్షేమ పాలనకు ప్రజాశీస్సులు

- మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు
- తణుకు 13వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనను ప్రజలు ఆశీర్వదిస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు 13వ వార్డులో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి గడపలోనూ ప్రభుత్వం నుంచి ఏదోక లబ్ధి పొందిన ప్రజానీకం సంతోషం వ్యక్తం చేస్తున్నారని స్పష్టం చేశారు. ముఖ్యంగా అమ్మఒడి, విద్యాదీవెన, విద్యాకానుక, వసతి దీవెన వంటి సంక్షేమ పథకాల ద్వారా విద్యా విప్లవాన్ని తీసుకువస్తున్నారని అన్నారు.

చంద్రబాబు కుయుక్తులు..

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దోచుకో దాచుకో అనే రీతిలోనే పరిపాలన సాగించారని, ఇచ్చిన హామీలు సైతం నెరవేర్చకుండా ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ప్రజల్లోకి వస్తున్నారని విమర్శించారు. జగనన్న ఇస్తున్న సంక్షేమం చంద్రబాబు తన సమయంలో ఎందుకు ఇవ్వలేకపోయారని నిలదీశారు. మొన్నటి వరకు జగనన్న సంక్షేమంతో ప్రజలను సోమరులుగా మారుస్తున్నారన్న చంద్రబాబు ఇప్పుడు తన సుపుత్రుడు లోకేష్‌తో మరింత ధీటుగా సంక్షేమాన్ని అమలు చేస్తామని చెప్పించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న సమస్యలను ప్రజానీకం మంత్రి కారుమూరి దృష్టికి తీసుకురాగా తక్షణమే పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ కొవ్వూరి ఈశ్వర రెడ్డి, ఏఈ రామకిషోర్, హౌసింగ్ ఏఈ వెంకట్రావు, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు మంగెన సూర్య, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, వైఎస్సార్ సీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు నూకల కనకదుర్గ, వార్డు నాయకులు పొట్ల సురేష్, మురాల సుధాకర్, నత్తా భాను పాల్గొన్నారు.

ఆర్థికసాయం

13వ వార్డుకు చెందిన ఓ వ్యక్తి ఇటీవల ప్రమాదంలో గాయపడగా, బాధితుడికి మంత్రి కారుమూరి రూ.5వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 22వ తేదీన తణుకులో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. పట్టణంలో మంగళవారం ప్రజా సంఘాల ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలపై అనేక భారాలు వేస్తున్నారని వాపోయారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. మణిపూర్ ఘటనలకు బీజేపీ కారణమని విమర్శించారు. కార్పొరేట్ వర్గాలకు దాసోహంగా ఉంటూ రాబోయే ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రావడానికి కేంద్ర ప్రభుత్వం ఎత్తులు వేస్తోందని, ఎత్తులను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి సీపీఐ ప్రచార యాత్ర ఈనెల 17 నుంచి చేపడుతున్నట్లు వెల్లడించారు. తణుకులో జరిగే బహిరంగ సభకు వేలాది కార్యకర్తలు,, ప్రజలు తరలి రావాలని కోరారు.

క్లుప్తంగా

వ్యాధి నిరోధక టీకాల పంపిణీ



టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నవాబుపాలెం, కృష్ణాయపాలెం, జగన్నాథపురం-1, 2 సచివాలయాల పరిధిలో మంగళవారం మిషన్ ఇంద్రధనస్సు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 0-9 ఏళ్ల లోపు బాలబాలికలు 81 మందికి, 36 మంది గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఎంఎల్‌హెచ్‌పీలు పి.రవికుమార్, మద్దుకూరి సత్యవాణి, బాబ్జీ, ఏఎన్ఎం సుభాషిణి, బి.రమాజ్యోతి, సూపర్‌వైజర్ ఎ.లక్ష్మణరావు, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేల్పూరులో ఇంద్ర ధనుష్ కార్యక్రమం

తణుకు టౌన్: మిషన్ ఇంద్ర ధనుష్ కార్యక్రమంలో భాగంగా తణుకు రూరల్ మండలం వేల్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో ప్రత్యేక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని మంగళవారం పీహెచ్‌సీ వైద్యాధికారి టీఎల్ఎస్ హరిణి ప్రారంభించారు. పీహెచ్‌సీ పరిధిలో గుర్తించి 24 మంది చిన్నారులకు టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఈ ప్రత్యేక టీకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన



ఏరియా ఆసుపత్రి వద్ద హెల్త్ కేర్ క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఫార్మసీ విభాగం హెల్త్ కేర్ అండ్ మేనేజ్‌మెంట్ క్లబ్ ఆధ్వర్యంలో తల్లి పాలు వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఏరియా ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ సభ్యులు మాట్లాడుతూ తల్లి శిశువుకు పాలు ఇవ్వడం వల్ల అటు శిశువుకు, ఇటు తల్లి ఆరోగ్యానికి ఎంతో ఉపయుక్తమన్నారు. ఆరోగ్యవంతమైన ఆహారపు అలవాట్లు చేసుకోవాలన్నారు. సమతుల్య ఆహారం ప్రాముఖ్యతను వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రసూతి మహిళలకు పండ్లు, డ్రై ఫ్రూట్స్ పంపిణీ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ పగడాల సూర్యనారాయణ, క్లబ్ చైర్మన్ భాను శ్యామ్, రీషా, బాల మేఘిని, కె.రమేష్, హీరా బట్టు, ఎస్.లిఖిత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

రేపు రెండు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం

తాడేపల్లిగూడెం రూరల్ : మండలంలోని ఆరుళ్ల, మారంపల్లి గ్రామాల్లో బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు మంత్రి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పాల్గొనే ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు హాజరు కావాలని కోరారు.

గర్భిణులు, బాలింతల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



మండపాకలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేస్తున్న వైసీపీ నాయకుడు ఆనంద్‌కుమార్



రాచర్లలో చిన్నారులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్, నాయకులు

తణుకు టౌన్: గర్భిణులు, బాలింతల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం అందజేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు జంగం ఆనందకుమార్ కోరారు. మంగళవారం తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ రేషన్ కిట్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. రేషన్ కిట్లలోని పదార్థాలను హెల్త్ అసిస్టెంట్ వైటీ మూర్తి వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జానా వెంకటలక్ష్మి, సొసైటీ అధ్యక్షురాలు, ఏఎంసీ డైరెక్టర్ వై.విజయామూర్తి, ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల సన్యాసిరావు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఇంటి వద్దకే రేషన్ కిట్లు

అత్తిలి: మండలంలోని కె.సముద్రపుగట్టు అంగన్‌వాడీ కేంద్రంలో టేక్ హోం రేషన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను సర్పంచ్ బండి వెంకటలక్ష్మి మంగళవారం అందజేశారు. ఎంపీటీసీ సభ్యుడు అద్దంకి శ్రీను, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కముజు శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ యాళ్ల అనిత పాల్గొన్నారు. పాలి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ కేతా గౌరీ పార్వతి ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యురాలు నల్లమిల్లి నాగమణి, వైఎస్సార్ సీపీ నాయకులు నల్లమిల్లి బాలాజీ రెడ్డి, బలిజేపల్లి భాస్కరరావు పాల్గొన్నారు. అత్తిలి-2 అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు టేక్ హోం రేషన్ కిట్లను అందజేశారు. సర్పంచ్ గంటా విజేత, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.కుమారి పాల్గొన్నారు.

మహిళల సంపూర్ణ పోషణే .

పెంటపాడు: తల్లీబిడ్డల ఆరోగ్యంతోపాటు, మహిళల సంపూర్ణ పోషణే సీఎం జగనన్న ధ్యేయమని రాచర్ల సర్పంచ్ వాకా వెంకట దుర్గాభవాని అన్నారు.వె వైఎస్సార్ సంపూర్ణ పోషణ, గర్భిణులు, బాలింతలకు టేక్ హోం రేషన్ కిట్‌ల పంపిణీ, తల్లి పాల వారోత్సవాలు పురస్కరించుకుని మంగళవారం గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్లవద్ద కార్యక్రమంలో సర్పంచ్ దుర్గాభవాని, ఎంపీటీసీ సభ్యురాలు చింతన శారద పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నాయకులు వాకా వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 45 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో జిల్లా ఉపాధి కల్పన అధికారి, కళాశాల అధ్యాపక బృందం

తణుకు టౌన్: తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో నేషనల్ కేరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో టెక్ మహీంద్ర నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 45 మంది విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ తెలిపారు. సోమవారం ఈ డ్రైవ్‌ను జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.కిషోర్‌రెడ్డి, యంగ్ ప్రొఫెషనల్ ఎంప్లాయింట్ ఆఫీసర్ బి.ప్రవీణ్‌కుమార్ నిర్వహించినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థినులకు 6 నెలలు చెన్నైలో శిక్షణ ఉంటుందని, అనంతరం వీరికి వార్షిక వేతనంగా రూ.2 లక్షల 40 వేలు అందజేస్తారని చెప్పారు. విద్యార్థినులను కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి అభినందనలు తెలిపారు.

చంద్రబాబుకు ప్రాజెక్టలను సందర్శించే అర్హత లేదు

- మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు



తేతలిలో విలేకరులతో మాట్లాడుతున్న మంగరాజు

తణుకు టౌన్: రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టలను పూర్తి చేసే సత్తా చంద్రబాబుకు లేదని, వాటిని పరిశీలించే అర్హత అంతకంటే లేదని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. మంగళవారం తణుకు రూరల్ మండలం తేతలి గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడు తూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రాజెక్టుల పరిశీలన పేరిట 200 మంది టీడీపీ కార్యకర్తలతో అలజడులు, అరాచకాలను సృష్టిస్తున్నారని చెప్పారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఒక్కరే రాష్ట్రంలో ప్రాజెక్టల నిర్మాణం చేపట్టారని తెలిపారు. వైఎస్ఆర్ పోలవరం కాలువలు తవ్విస్తుంటే చంద్రబాబు తన అనుచరుడు దేవినేని ఉమాతో కోర్టులో కేసులు వేయించి అడ్డుకున్నారని చెప్పారు. అప్పట్లో ఎకరం భూమి రూ. 6 లక్షలకు ప్రభుత్వం కొనుగోలు చేస్తే చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఎకరాన్ని రూ. 50 లక్షలకు పెంచేసి దోచుకున్నారని చెప్పారు. రాష్ట్రానికి 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు రాష్ట్రంలో ఒక్క ప్రాజెక్టను కూడా పూర్తి చేయలేదని, మళ్లీ అధికారంలోకి వస్తే ప్రాజెక్టలను పూర్తి చేస్తాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్రబాబు చేతకానితనం వల్లే పోలవరం ప్రాజెక్ట్ ఇప్పటికీ పూర్తిచేయడానికి ఇబ్బందిగా మారిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలవం ప్రాజెక్ట నిర్మాణం పూర్తి చేసుకుని అందుబాటులోకి వస్తుందని ఆయన చెప్పారు.

మద్యపానంతో జీవితం దుర్భరం



మాట్లాడుతున్న సైకాలజిస్ట్ గంగాధర్‌రెడ్డి

తాడేపల్లిగూడెం రూరల్: మద్యపానంతో జీవితాలు దుర్భరమవుతాయని సైకాలజిస్ట్ తేతలి గంగాధర్‌రెడ్డి అన్నారు. శ్రీ దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని పెద తాడేపల్లి శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి ఆలయ ఆవరణలో మద్యపానం - దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ క్షణికానందం కోసం మద్యపానం, ధూమపానం, గంజాయి, డ్రగ్స్ వంటి వాటికి యువత బానిసలవుతున్నారని, వాటి బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. అటువంటి అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఆటో యూనియన్ అధ్యక్షుడు లక్ష్మణరావు, సొసైటీ కౌన్సిలర్ పి.శ్రీను, ఎస్.కృష్ణ, కె.భాను శ్రీ, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు అండగా ఉంటా..

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



తణుకులో రాష్ట్ర మంత్రి కారుమూరిని సత్కరించిన నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్ఫూర్తితో నాయీ బ్రాహ్మణులకు అండగా ఉంటానని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సంఘ కమ్యూనిటీ భవనంలో నిర్వహించిన నాయీ బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి మంత్రి కారుమూరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2011లో ఇదే కమ్యూనిటీ భవనాన్ని తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నిర్మించానని, పైఅంతస్థును కూడా తానే నిర్మాణం చేయిస్తానని హామీ ఇచ్చారు. బీసీ వర్గాలతో పాటు అగ్రవర్ణాల్లోని పేదలకు సైతం ముఖ్యమంత్రి పెద్దపీట వేస్తున్నారని స్పష్టం చేశారు. టీడీపీ బీసీలను కేవలం ఓట్లు వేసే యంత్రాలుగా మాత్రమే వాడుకుంటుందని, గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో బీసీ కమ్యూనిటీ హాలు నిర్మించి అన్ని రాజకీయ పార్టీల అభిమతం మేరకు బీసీల ఆరాధ్యుడు జ్యోతిరావు పూలే నామకరణం చేశామని, అయితే టీడీపీ ప్రభుత్వం రాగానే ఎన్టీఆర్ భవనంగా పేరు మార్చారని విమర్శించారు. అకారణంగా పూలే, ఎన్టీఆర్‌లను కూడా టీడీపీ పాలకులు అవమానించారని, తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాగానే బీసీల కోరిక మేరకు జ్యోతిరావు పూలే భవనంగా మార్చించినట్లు చెప్పారు. వేల్పూరులో తమ ప్రభుత్వ హయాంలో 6 బీసీ కమ్యూనిటీ హాల్స్ మంజూరు చేసి నిర్మాణాలు శ్లాబ్‌ల వరకు పూర్తయిన తరువాత స్థానిక టీడీపీ నేత కోర్టుకు వెళ్లి బిల్లులు రాకుండా అడ్డుకున్నారని విమర్శించారు. తణుకు నియోజకవర్గంలో ఏ మంచి పని చేద్దామని ముందుకు వచ్చినా టీడీపీ నేత అడ్డుపడి నిలువరిస్తుండడం బాధాకరమని అన్నారు.

ఆపద్బాంధవుడు మంత్రి కారుమూరి

నాయీ బ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్షుడు కొట్టాపి శ్రీనివాస్ మాట్లాడుతూ మంత్రి కారుమూరి తణుకు పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘానికి అండగా నిలబడ్డారని అన్నారు. నాయీ బ్రాహ్మణుడు గనిరేటి రాము లివర్‌కు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ ఆస్పత్రి పాలైతే గతంలో రూ. 2.50 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్, రూ.లక్ష సొంత నిధులతో మంత్రి కారుమూరి వైద్యం చేయించారని, ఇప్పుడు తాజాగా లివర్ మార్చాల్సిన పరిస్థితుల్లో రూ.40 లక్షలు ఖర్చు అవుతుండగా ప్రభుత్వ నిధులతో పాటు ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడి వైద్యం చేయిస్తానని హామీ ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇలా తమ నాయీ బ్రాహ్మణుడికి మంత్రి కారుమూరి ప్రాణభిక్ష పెట్టారని, ఆయనకు తమ సంఘం అంతా రుణపడి ఉంటామని చెప్పారు. ముందుగా మంత్రి కారుమూరిని సంఘం ఆధ్వర్యంలో గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షులు జామి నాగేశ్వరరా వు, ఆతవ శ్రీనివాస్, కార్యదర్శి గాడెల్లి గోపాల రావు, కోశాధికారి రౌతు గణపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ జామి శ్రీనివాసరావు, గౌరవ సలహాదారు తాడి రామకృష్ణ,, కొట్టాపి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు జామి సత్యనారాయణ, సహాయ కార్యదర్శి ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు మంగెన సూర్య, ఉపాధ్యక్షులు సప్పా బలరామకృష్ణ, కుడు పూడి చంద్రరావు, డోలా సింహాద్రి పాల్గొన్నారు.

జాతీయ పతాకావిష్కరణకు అవకాశం కల్పించాలి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

తణుకు టౌన్: రాబోయే దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ జెండాను ఎగురవేసే అవకాశాన్ని జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు కల్పించాలని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు. మంగళవారం వరద బాధితులను పరామర్శించేందుకు రాజమండ్రికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని హెలీప్యాడ్ వద్ద ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ శాలువా కప్పి పూలబొకేను అందజేశారు. ఈ సందర్భంగా వచ్చే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ జెండాను ఎగురవేసే అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో 2 నుంచి 4 ప్రభుత్వ పాఠశాలలు ఉంటున్నాయని, గ్రామంలో ప్రధానమైన పాఠశాలలో గ్రామ సర్పంచ్ జాతీయ పతాకాన్ని ఎగురవేసి, మిగిలిన పాఠశాలల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీలు సభ్యులు జాతీయ పతాకాన్ని ఎగురవేసే అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిపారు. దీనికి సానుకూలంగా స్పందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ విషయాన్ని పరిశీలించాలని ఉన్నతాధికారులను ఆదేశించారని తెలిపారు.

మరనాత గార్డెన్‌లో తైలాభిషేక పండుగ

అత్తిలి: తైలాభిషేకం ద్వారా సకల అభివృద్ధి, ఆశీర్వచనాలు కలుగుతాయని కె.సముద్రపుగట్టు గ్రామ మరనాత గార్డెన్ బైబిల్ మిషన్ పాస్టర్ జాన్సన్ అయ్య తెలిపారు. మంగళవారం మందిరంలో తైలాభిషేక పండుగ నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య ప్రసంగీకులుగా హాజరై పండుగ విశిష్టతను వివరించి, తైల ప్రార్థనలు చేశారు. మానవులకు ఏ లోటు లేకుండా మార్గదర్శిగా దేవుడు ఉన్నాడని చెప్పారు. పాస్టర్ డైమండ్ గ్లోరియస్, జాన్సన్ జ్యోతి ప్రార్థనా కార్యక్రమాలను పర్యవేక్షించారు. తైల ప్రార్థనలు అనంతరం విశ్వాసులకు అన్నదానం చేశారు. బ్యూలాశాంతి, జాన్ గ్లోరియస్, విశ్వాసులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌కు సహకరించాలి



సత్యనారాయణరాజుకు ప్రశంసా పత్రం అందిస్తున్న మున్సిపల్ కమిషనర్ కేటీ సుధాకర్

తణుకు అర్బన్: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో తణుకు మున్సిపాలిటీని ముందు వరుసలో ఉంచేందుకు ప్రజలు సహకరించాలని కమిషనర్ కేటీ సుధాకర్ కోరారు. మున్సిపాలిటీలో తడి, పొడి చెత్త సేకరణకు సహకరించిన 29 మందికి మంగళవారం కమిషనర్ ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆదేశాల మేరకు పారిశుధ్య నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఈఈ కొవ్వూరి ఈశ్వరరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోవిందయ్య, ఏఈ శిరీష,, రిటైర్డ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎండాకు తెగులు నివారణకు సూచనలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి, దండగర్ర, ఆరుగొలను, కొత్తూరు, కృష్ణాయపాలెం, జగన్నాథపురం, మాధవరం గ్రామాల్లో వరిపై బ్యాక్టీరియా ఎండాకు తెగులు కనిపిస్తోందని మండల వ్యవసాయాధికారి ఆర్ ఎస్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన తాడేపల్లిగూడెంలో విలేకరులతో మాట్లాడారు. బ్యాక్టీరియా ఎండాకు తెగులు ఐదు శాతం కంటే ఎక్కువ ఉంటే వెంటనే నివారణ చర్యలు చేపట్టాలన్నారు. యూరియా వాడకం పూర్తిగా నిలిపివేయాలని, ఎకరాకు 15 నుంచి 20 కిలోల పొటాష్ వేసుకోవాలని సూచించారు. కొసైడ్ రెండు గ్రాములు, ప్లాంటామైసిన్ ఒక గ్రాము ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ముందుగా వరి చేలలోని నీటిని బయటకు పంపాలని, కొత్తనీరు పెట్టిన తర్వాత సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసుకోవాలని ఏవో ప్రసాద్ సూచించారు.

కొత్త రేషన్ కార్డుల పంపిణీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని 14వ వార్డులో మంగళవారం వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌ఛార్జులు నీరుకొండ పండు, మిద్దే ఆదినారాయణ అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు అందజేశారు. అలాగే ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు వార్డులో వైఎస్ఆర్ బీమాలో భాగంగా మృతి చెందిన ఏసు కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందజేశారు. వెల్ఫేర్ సెక్రటరీ కృష్ణవేణి, ప్లానింగ్ సెక్రటరీ ప్రసాద్, ఉదయ్ భాస్కర్ పాల్గొన్నారు.

గద్దర్ మృతి తీరని లోటు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజా కళాకారుడు, విప్లవ కవి, గాయకుడు గద్దర్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ, దళిత హక్కులు, కుల నిర్మూలన పోరాట సమితి, ప్రగతిశీల, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు అన్నారు. సీపీఐ కార్యాలయంలో మంగళవారం సంతాప సభ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.